క్లుప్తంగా

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల్లో మౌలిక వసతులు కల్పించి అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. ఇటిక్యాల మండలం ధర్మవరంలో శనివారం రూ.10లక్షలతో సీసీరోడ్డు, బీచ్‌పల్లిలో రూ.10లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ఆహ్లాదకర వాతావరణం కోసం పల్లెప్రకృతి వనాలు, నర్సరీల ఏర్పాటుతోపాటు హరితహారం కార్యక్రమంలో మొక్కలను పెద్దఎత్తున నాటి పెంచుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్రీడాప్రాంగణాలు, డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు నాయుడు, ఉపసర్పంచ్ మునిగౌడ్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ



శాంతినగర్: మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ మహిళలు, హెల్పర్లకు శనివారం సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. సత్యసాయి జయంతి సందర్భంగా వడ్డేపల్లి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న 66 మందికి చీరలను అందజేసినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

ఎర్రవల్లిచౌరస్తా: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్ ఏఎస్ రెడ్డి సూచించారు. ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50మంది స్పోకెన్ ఇంగ్లిష్ ట్రైనర్లు పాల్గొని ఆంగ్లం మాట్లాడే విధానంపై విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, మధులిక, నందిని తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంలో వెనుకబాటు

గద్వాల అర్బన్: గద్వాల నియోజకవర్గం విద్య, వైద్యంలో వెనుకబాటుకు గురైందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, విజయ్‌కుమార్, గోవిందు, ఖాజా, రంగస్వామి, అమరేష్ పాల్గొన్నారు.

23న కలెక్టరేట్ వద్ద ధర్నా



గద్వాల అర్బన్: ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆశల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాలో ఆశ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, కాంతమ్మ, మాధవి, పద్మ, సరస్వతి ఉన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని మేడికొండ, ఉప్పల క్యాంపు గ్రామాల్లో శనివారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 78 పశువులకు టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అలంపూర్: క్షేత్రస్థాయిలో బీఎస్పీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు ప్రభుదాస్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం ఉండవెల్లి మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శిగా నాగేంద్రంను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ పార్టీని పటిష్టపర్చేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో అయ్యన్న, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మల్దకల్: శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనల ముగింపు సందర్భంగా కృష్ణాజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శేషంపల్లి నర్సింహులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, అరవిందరావు, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు, సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అభయాంనేయస్వామికి పంచామృత అభిషేకం తదితర పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అయిజ: శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా పట్టణంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఆంజనేయస్వామి ఆలయం నుంచి కట్టకింది తిమ్మస్వామి ఆలయం వరకు మేళతాళాలతో రైతులు ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు. తిమ్మప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పలహారపు బండ్లతో పట్టణానికి చేరుకున్నారు.



అయిజలో ఎడ్లబండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

వర్షాల కోసం కాడి కట్టిన రైతులు

రాజోళి: వర్షాల కోసం రైతులు కాడెద్దు కట్టి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త రాజోళిలోని సీతారాములు స్వామి ఆలయం నుంచి రైతులు 21 ఎడ్ల జతలు కట్టుకుని భజనలు చేసుకుంటూ తుంగభద్ర నదికి వెళ్లి సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు, అనంతరం నది నీటిని తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో రైతులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామ రైతులు ఎడ్లబండ్లతో స్థానిక వసంత మాధవస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొంకల ఆంజనేయస్వామి ఆలయం నుంచి నిండుబిందె నీళ్లు తీసుకొచ్చి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బీచుపల్లి అభయాంజనేయస్వామి



రాజోళిలో..



మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో..



వడ్డేపల్లి మండలం కొంకలలో..

ఓటుహక్కుపై అవగాహన ఉండాలి



ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు

అలంపూర్: ఓటుహక్కుపై అందరికీ అవగాహన ఉండాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఓటు ప్రాధాన్యతను తెలియజేసేందుకు శనివారం పట్టణంలో 5కే రన్ నిర్వహించగా, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, బీఎల్‌ఓలతోపాటు పట్టణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు గాంధీచౌక్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటుహక్కు వినియోగంపై అడిషనల్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటుహక్కుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని కోరారు. రాష్ట్రంలోనే అలంపూర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జోగుళాంబ అమ్మవారి సన్నిధి నుంచి ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బీఎల్‌ఓల నుంచి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ నిత్యానంద్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ జుబేర్, ఎంపీడీఓ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు పాటుపడుదాం

గద్వాల అర్బన్: కాంగ్రెస్ గెలుపునకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ప్రకటనలో పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన తిరగబడుదాం–తరమికొడుదాం కార్యక్రమానికి తాలూకా కోఆర్డినేటర్లుగా సరిత, కురువ విజయ్‌కుమార్, శంకర్, నారాయణరెడ్డి, రాజీవ్‌రెడ్డి, వీరుబాబులను నియమించినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

గడప గడపకు బీజేపీ

శాంతినగర్: వడ్డేపల్లి మండలం బుడమొర్సులో శనివారం గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఇంటింటికెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, నర్సింహులు, బీకే శ్రీను, ఎల్లేష్ పాల్గొన్నారు.

ఇసుక వాహనాల పట్టివేత



రాజోళి: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన రెండు మినీ టిప్పర్లు, ఒక టిప్పర్‌లో తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

గద్వాల రూరల్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 52మంది ముస్లిం మైనార్టీలకు వందశాతం సబ్సిడీపై రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం చెక్కులను పంపిణీ చేశారు. మల్దకల్ మండలం మల్లెందొడ్డికి కర్రె నర్సింహులు ఇటీవల మృతి చెందగా, అతడి కుటుంబసభ్యులకు మంజూరైన రూ.5లక్షల రైతుబీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అదేవిధంగా గట్టు మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ డైరెక్టర్ సుభాన్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ సరోజమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, ఎంపీపీలు విజయ్, ప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, రైతు సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మైనార్టీలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ఉత్సాహంగా మండలస్థాయి క్రీడాపోటీలు



క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన అలంపూర్ మాంటిస్సోరి విద్యార్థులు



మాచర్లలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గట్టు: మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు గురుకుల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్–14 బాలికల విభాగంలో 36మంది, బాలుర విభాగంలో 36మంది, అండర్–17 బాలికల విభాగంలో 36మంది, బాలుర విభాగంలో 36మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హెచ్‌ఎం నర్సింహులు, పీఈటీల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు బీసన్న, పీఈటీలు రాములమ్మ, గణేష్, నర్సింహులు, రమేష్ పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈనెల 22న ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ సురేష్ తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థినీ విద్యార్థులకు అండర్–14, 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఉంటాయని, ఆసక్తిగల క్రీడాకారులు పీఈటీ శ్రీనివాసులును సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ప్రతిభ

అలంపూర్: ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్–14 బాలుర విభాగం వాలీబాల్ పోటీల్లో ప్రథమ, బాలికల విభాగం కబడ్డీలో ప్రథమ, ఖోఖోలో ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం నాగలక్ష్మి, డైరెక్టర్ రవిప్రకాష్ తెలిపారు. అదేవిధంగా అండర్–17 బాలుర విభాగం వాలీబాల్‌లో ప్రథమ, కబడ్డీలో ద్వితీయ, ఖోఖోలో ద్వితీయ బహుమతులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతోపాటు పీఈటీ శివనాయుడును వారు అభినందించారు.

శాంతినగర్: ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీల్లో వడ్డేపల్లి సరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మమత, హెచ్‌ఎం రవి తెలిపారు. బాలికల అండర్–17 కబడ్డీ పోటీల్లో శిరీష, ఖోఖోలో లక్ష్మీప్రియ, బాలుర అండర్–14 కబడ్డీలో జగన్, అండర్–17 విభాగంలో శివ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు గోవింద్, నవీన్ అభినందించారు.

కాంట్రాక్టు ఏఎన్‌ఎంలపై చిన్నచూపు తగదు

గద్వాల అర్బన్: కాంట్రాక్టు ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న అన్నారు. జిల్లా కేంద్రంలో ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మెకు శనివారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, జ్యోతి, సరస్వతి, రేణుక, లక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న ఏఎన్‌ఎంలు

హమాలీలకు బాసటగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

ధరూరు: హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి బాసటగా నిలవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో శనివారం హమాలీ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూటలు మోస్తూ సమాజానికి సేవ చేస్తున్న వారిపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. హమాలీలకు ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26, 27 తేదీల్లో గద్వాలలో నిర్వహించనున్న శిక్షణ తరగతులకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, దేవదాసు, గోవిందు, మోష, తిమ్మప్ప, ఆంజనేయులు, కృష్ణ, మునెప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీడే వేడుకలు

గట్టు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన ఫొటో, వీడియోగ్రాఫర్లు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, ఉపాధ్యక్షుడు కమ్మరి వెంకటేష్, సుదీర్‌కుమార్, సురేష్, మౌలాలి, వీరేష్, చిన్నరాజు, అశోక్, ధనుంజయ్, శ్రీను పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో, వీడియో గ్రాఫర్లు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోవిందు, ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి, వెంకటేష్ పాల్గొన్నారు.



గట్టులో ఫొటోగ్రఫీడే వేడుకల్లో పాల్గొన్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

చదువుతోనే మంచి భవిష్యత్



స్మార్ట్ ఫోన్లలో యాప్‌లను డౌన్‌లోడ్ చేయిస్తున్న జీహెచ్‌ఎం నరేష్

ధరూరు: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జీహెచ్‌ఎం నరేష్ కోరారు. మండలంలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం 'ఇంటింటా చదువుల పంట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం మాట్లాడుతూ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఇంటి వద్ద చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థులను పాఠశాలకు పంపకుండా వ్యవసాయం ఇతర పనులకు ఉపయోగించుకోవడం వల్ల చదువులో వెనుకడడే అవకాశం ఉటుందన్నారు. ఈ సందర్భంగా స్మార్ట్ ఫోన్లలో స్విఫ్ట్ చార్ట్, దీక్షయాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. ఇంటింటా చదువుల పంట పాఠ్యపుస్తకం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పాఠ్యాంశాలను ఏ విధంగా నేర్చుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విష్ణు, తిమ్మారెడ్డి, మల్లప్ప, అరవింద్, గోపి, సుజాత, పద్మ పాల్గొన్నారు.

పాఠశాలల సమాచారాన్ని పొందుపర్చాలి

అయిజ: పీఎంశ్రీ రెండో దశకు పాఠశాలల ఎంపిక కోసం పూర్తిస్థాయి సమాచారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సిరాజుద్దీన్ తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం గట్టు, అయిజ, వడ్డేపల్లి, రాజోళి, ఉండవెల్లి, అలంపూర్ మండలాల ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పీఎంశ్రీ రెండవ దశలో పాఠశాలల ఎంపికకు పూర్తిస్థాయి సమాచారం పొందుపర్చాలని సూచించారు. దీని ఆధారంగానే పీఎంశ్రీకి ఎంపిక కాబడుతుందన్నారు. ఎంపికైన పాఠశాలలకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం విద్యాభివృద్ధికి సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి శాంతిరాజు, ఏపీఓ శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్‌ఎం శేషఫణిశర్మ తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎర్రమట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది. బుడమొర్సు సమీపంలోని గొల్లగట్టు, వడ్డేపల్లి వసంత మాధవస్వామి గుట్ట, తనగల తిమ్మప్ప గట్టు, జూలెకల్ శివాలయం తిప్పలగట్టు నుంచి కొందరు మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సెలవు దినాలు వచ్చాయంటే.. అక్రమార్కులకు పండుగే అని మండల ప్రజలు పేర్కొంటున్నారు. గుట్టల నుంచి యథేచ్ఛగా మట్టి తరలింపు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎర్రమట్టి అక్రమ తరలింపుతో రానున్న రోజుల్లో గుట్టలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు..

గుట్టల్లో ఎర్రమట్టి తవ్వేందుకు కొందరు బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అనుమతి లేకుండా చేస్తున్న బ్లాస్టింగ్‌లతో ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తనగలగట్టు, బుడమొర్సు గొల్లగట్టులపై తరచూగా బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. ముందుగా చాటింపు వేయకుండా చేసే బ్లాస్టింగ్‌లతో ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయమై మైనింగ్ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా.. స్పందించకపోవడం ప్రజల ఆరోపణలకు ఊతమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లకు పాల్పడుతూ ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులో ఈనెల 10న రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై ఈశ్వర్, రామలింగయ్య శాంతినగర్‌కు వెళ్తుండగా.. లారీని ఓవర్‌టేక్ చేస్తూ కారు ఢీకొట్టిందని, ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు పేర్కొన్నారు. ఈశ్వర్ సోదరుడు నాగ రాజు ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నసీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.